# ఫోటో

స్వరంగ్ ఫోటో స్టూడియో ప్రొప్రయిటర్ కిరణంగారు పంపిన ఫోటోకు అఖిల భారత స్థాయిలో జరిగిన ఒక పోటీలో ప్రథమ బహుమతి వచ్చింది.

ఆ బహుమతి క్రింద వారికి పదివేల రూపాయలు, ఒక ప్రశంసా పత్రం లభించాయి. ప్రఖ్యాత ఫోటోగ్రాఫర్ల జాబితాలో వారి పేరు చేరింది.

మిత్రులను పిలిచి ఒక ఖరీదైన హోటల్లో ఘనంగా పార్టీ ఇచ్చారు. బహుమతి గెలుచుకున్న ఫోటోను అందరూ చూశారు. కిరణంగారిని మెచ్చుకున్నారు. గొప్ప ఆర్టిస్ట్ అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో అతనికి గుర్తింపు రావాలని కోరుకుంటున్నామన్నారు. కొంతమంది భగవంతున్ని కూడా ప్రార్థిస్తున్నామన్నారు.

అప్పుడు తమను మరిచిపోవద్దని మరీ మరీ ప్రాధేయపడ్డారు.

ఆనాటి పార్టీకి ముఖ్య అతిథిగా వచ్చిన మంత్రిగారు అమెరికాలో జరుగబోతున్న అంతర్జాతీయ ఫోటో ఆర్టిస్టుల మహాసభకు మనదేశం తరపున కిరణంగారిని పంపడానికి సెంట్రల్ గవర్నమెంటుకు రికమెండ్ చేస్తానని చప్పట్ల మధ్య గట్టిగా అన్నారు.

ఇలా బహుమానం ఇచ్చి తనను ప్రోత్సహించినందుకు ఆ పోటీ నిర్వాహకులకు కిరణంగారు హృదయ పూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

తన కళను గుర్తించి అభినందించిన మంత్రిగారికి, మిత్రులకు వినయంగా నమస్కరించి వారికీ కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

రుచికరమైన పదార్థాలను త్వరత్వరగా సప్లయి చేయించిన హోటల్ మేనేజరుగారికి కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

పార్టీ ముగిసింది.

కార్లు, స్కూటర్లు, ఆటోరిక్షాలు, రిక్షాలు కదిలాయి.

ఆ హోటల్ గేటుముందు నిలబడి ఒక కుర్రవాడు దీనంగా చేతులు చాచి బిచ్చం అడుక్కుంటున్నాడు.

"లచ్చుమయ్యా ! ..."

.... .... .... .... .... .... ....

"లచ్చుమయ్యా "

ఆ అడుక్కునే కుర్రాడి పేరే లచ్చుమయ్య.

బిచ్చగాళ్ళకూ పేర్లుంటాయా ?

ఊహూఁ....

ఉండవు. మాసిపోతాయి....బ్రతుకుల్లాగే. 'వాళ్ళూ మనుషులే' అన్న ఆలోచనలాగే.

బిచ్చగాన్ని పేరుపెట్టి పిలునరు.

ఒరేయ్ అంటారు

ఓ గోండా అంటారు.

ఓ బిచ్చగోడా అంటారు.

"లచ్చుమయ్యా !...."

మరి ఆ పిలు పేమిటి ? పిలిచేదెవరు ?

తల్లి ....

ఆ బిచ్చగాని తల్లి పిలుస్తున్నది.

గల్లికి బిచ్చగాడైనా తల్లికి కొడుకే లచ్చుమయ్యే.

"ఓవ్వ ఏందే ?...."

చేనులోని దిష్టిబొమ్మలాంటి లచ్చుమయ్య రోడ్డుప్రక్కన చెట్టు క్రింద ముడుచుకొని పడుకున్న తల్లి దగ్గరకు వచ్చాడు. ఆ అబ్బాయి ఒంటికి పొడవైన అంగి వ్రేలాడుతున్నది.

దాని ఒంటి నిండా గాయాలే !

అది లచ్చుమయ్య తొడుకున్నట్టుగా లేదు.

ఆ అంగిలో లచ్చుమయ్య దిగేసినట్టుగా ఉన్నాడు.

"ఏం దొరకలేదా బిడ్డా!...." కళ్ళనిండా నీళ్ళతో ఆ తల్లి కొడుకును గ్గరికి తీసుకున్నది.

''అవ్వా ఏడ్వకే ..." తల్లి కన్నీళ్ళు తుడిచాడు లచ్చుమయ్య.

కొడుకు ఎండిపోయిన డొక్కను చూసి, ఆ తల్లి మనసు విలవిల్లాడింది. రెండు రోజుల్నుంచి కొడుకు ఏం తినలేదు.... అడిగి పెడదామంటె ఆమెకు శక్తి లేదు.

మూడు రోజుల క్రితందాకా నయాపుల్ దగ్గర అడుక్కునే ఒకామెకు తన కొడుకును అరువిచ్చింది. మరో ఇద్దరు పిల్లలను పోగుచేసి వాళ్ళను రోడ్డు ప్రక్కన పడుకోబెట్టి ఆమె బిచ్చం అడుక్కునేది. వచ్చినదాంట్లో కొంత పిల్లలకు ముట్టజెప్పేది. దాంతో ఒక పూట తిండి దొరికేది. తల్లి, కొడుకు పంచుకుని తినేవాళ్ళు.

కాని రెండురోజులనుంచి ఆమె కనిపించడంలేదు.

లచ్చుమయ్య హోటలుముందు నిలబడి ''అయ్యా! దరుమం సెయ్యండి బాబూ-ఒక్క పైస ఎయ్యి దొర...." అంటూ అడుక్కుంటున్నాడు.

చెత్తా చెదారం పేరుకపోతే వీధి అందం చెడిపోతుంది. దుర్గంధం పుడుతుంది. ఆరోగ్యానికి భంగం వాటిల్లుతుంది అనుకుంటారు.

కాని తోటి పౌరులు విచ్చగాళ్ళై తిరుగుతుంటే వీధుల అందాలు చెడి పోవూ? దుర్గంధం పుట్టదూ? సమాజారోగ్యానికి భంగం వాటిల్లదూ?

అసలు గుడులు, మసీదులు, చర్చ్‌లు, అందమైన కట్టడాలు అనగానే గుర్తు కొచ్చేదెవరు?

"బిడ్డా...." అంటూ అప్యాయంగా ఆమె కొడుకు తలను నిమురసాగింది. ఆమెకు మిగిలిన ఆశ ఆ ఒక్కడే!.... కాని, ఈ సంఘంలో ఆ ఒక్కడి స్థానం ఏమిటి?

వాళ్లు అందరిలాగే ఈ సత్రానికి వచ్చారు.

కాని ఎందుకు? ఎందుకు? ఎందుకిలా అయ్యారు!

"అవ్వా "

తల్లి కళ్ళలోకి జాలిగా, బాధగా చూశాడు లచ్చుమయ్య.

"ఆకలైతాందా బిడ్డా....!"

కాదూ?

ఆకలికి ఆ కడుపులంటే ఎంత వేడుక?

"నేనేం చేద్దును బిడ్డా—!"

ఆ తల్లి పేగు లవిసిపోయాయి

చేయబోతే పనిలేదు ఎక్కడా పొమ్మన్నవాళ్ళే? తట్ట మోయటానికి వెళితే అక్కడ పోటీగా ఎన్నో తలలు సిద్ధం!- పేగుల్లో చొరబడిన ఆకలి రోజు రోజుకూ బలాన్ని పుంజుకొని వున్న బలాన్ని మింగేసింది.

ఇప్పుడు ఆమె ఒంట్లో సత్తువలేదు.

ఇంకా సత్తువరాని కొడుకున్నాడు.

సత్తువ ఇవ్వలేని దేశం వుంది.

చుట్టూ అంతులేని సముద్రం ఉంది.

వనాలకు రక్షణ ఉంది!

మృగాలకు రక్షణ ఉంది!!

* * *

కిరణంగారులాంటి గొప్ప ఆర్టిస్ట్ తమవాడైనందుకు ఎంతో గర్వపడు తున్నట్లు ఆ ప్రాంతపు పత్రికలు రాశాయి.

రేడియోలు అదే కూశాయి.

కొన్ని నెలలదాకా ఏదో ఒక పత్రిక కిరణంగారి ఫోటోను, వారు తీసిన ఫోటో ఫోటోను వేస్తూనే వున్నాయి.

ఫలితంగా నవరంగ్ ఫోటో స్టూడియో ముందు క్యూలు హారిజాంటల్‌గా, ఆ స్టూడియో భవనం వర్టికల్‌గా పెరిగిపోసాగాయి!

కిరణంగారిని ఎన్నో మీటింగ్‌లు పిలుస్తున్నాయి!

పదవులు పిలుస్తున్నాయి ! !

బహుమానం గెలిచిన 'ఫోటో' గర్వంగా ఆ భవనంలోంచి బజారును చూడసాగింది.

* * *

పుర్రెలను రాశి పోసినట్లు ఆ భవనం తెల్లగా వుంది.

ఆ భవనం మధ్యహాలు కొత్త నోట్లలాంటి గరగరలాడే దుస్తులేసుకున్న వాళ్ళతో నిండిపోయింది.

ఆ హాలుమధ్య పేదవాని నడుంలాంటి బల్లలమీద రకరకాల సైజుల్లో గ్లాసు లున్నాయి.

కొన్ని గ్లాసుల్లో రక్తంలాంటి ద్రావకం-

మరికొన్ని గ్లాసుల్లో చెమటలాంటి ద్రావకం ఉన్నాయి.

నవ్వుల్లాంటి పూలను కోసుకొచ్చి అక్కడి కుండీలలో బంధించారు.

వాటి ప్రక్కన ఎండిపోయిన డొక్కల్లాంటి ప్లేట్లలో విరిగిన ఎముకల్లాంటి చెంచాలున్నాయి.

పదునైన కత్తుల్లా మెరిసిపోతున్న మనుషులు ఇంకా ఆ హాలులోకి వస్తూనే ఉన్నారు.

ఆ హాలు వెనుక పొయ్యి ఆకలిలా భగభగమంటున్నది. దానిమీద జలాస్రాలు ఉడుకుతున్నాయి.

విశ్వాసంగల జంతువుల్లా కొందరు పనిమనుషులు హడావిడిగా అటూ ఇటూ తిరుగుతున్నారు.

మనిషిలా ఒక కుక్క ఆ భవనం ముందు వరండాలో కుర్చీ ఎక్కి తాపీగా కూర్చుంది.

ఆ రోజు ఆ భవనం యజమానికొడుకు పుట్టినరోజు.

ఆ భవనం వెనుక రెండు దిష్టి బొమ్మలు నిలుచున్నాయి.

ఒకటి లచ్చిమయ్య...

రెండవది లచ్చిమయ్యను కన్నతల్లి !

వాళ్ళ చూపులు మూసివున్న దొడ్డి గుమ్మంమీదున్నాయి.

ఆ గుమ్మం తలుపులు తెరుచుకుంటాయనే ఆశతో ఉన్నాయి.

అవి తెరచుకుంటే ఆకలి తీరుతుందనే ఆశతో ఉన్నాయి.

భవనంముందు వరండాలో నిలబడి అరటిపండ్లు తింటున్నారు కొంత మంది పిల్లలు.

గేటు ప్రక్కన ఒక మేక, దాని పిల్లలు నిలుచున్నాయి.

ఆ మేక చూపులు పిల్లల మీదున్నాయి.

వాళ్లు విసిరేసే తొక్కల కోసం ఆశగా చూస్తున్నాయి.

లచ్చుమయ్య, లచ్చుమయ్య తల్లి చూపులు తలువుల మీదున్నాయి.

అవి ఎప్పుడు తెరుచుకుంటాయోనని ఆశగా చూస్తున్నాయి.

కొంచెంసేపటికి దొడ్డిగుమ్మం తలుపులు తెరుచుకున్నాయి. వాళ్ళ కళ్ళ లోని ఆశకు రెక్కలు మొలిచాయి మరో నలుగురైదుగురు ముష్టివాళ్లు వచ్చి చేరారు. ఆ తలుపులు తెరిచిన పనిమనిషి చెత్తకుండీలో చెత్త పడబోసి వెళు తున్నది.

"ఓవ్వ బుక్కెడు బువ్వుంటే సూడు బాంచెను...'' దండంపెడుతూ అడి గింది లచ్చుమయ్య తల్లి.

''బుక్కెడు బువ్వ తేనా ?.... ఏడున్నంచి?'' అంటూ దీర్ఘం తీసింది పని మనిషి. ''బువ్వలేదు గివ్వలేదు పోండ్లి పోండ్లి....దొరజూస్తే కోపంజేస్తడు....'' అంటూ దభాల్న తలుపులు మూసేసింది.

మిగతా ముష్టివాళ్లు మరోచోటికి వెళ్ళిపోయారు.

కాని....ఆశగా ఇంకా ఆ తలుపులవైపేచూస్తూ లచ్చుమయ్య. తల్లి అక్కడే నిలుచున్నారు.

లచ్చుమయ్య నిలుచోలేక నేలమీద కూలబడిపోయాడు. కళ్ళకు చీకట్లు కమ్ముతున్నాయి. ఒళ్ళంతా చెమటతో తడిసి ముద్దయింది.

కళ్ళల్లో ప్రాణాలు నిలుపుకొని ఆశగా గుమ్మంకేసి చూస్తున్నాడు.

''బిడ్డా....'' అంది నీళ్ళు నిండిన కళ్ళతో కొడుకును చూస్తూ తల్లి.

పల్లెలో పనిలేక పస్తులు ఉండీ ఉండీ భార్య. కొడుకును తీసుకొని బ్రతుకు తెరువు కోసం పట్నం వచ్చాడు లచ్చుమయ్య తండ్రి.

పట్నంలో మాత్రం పని దొరుకుతుందా ?

రిక్షా తొక్కసాగాడు.

రిక్షాలు మాత్రం తక్కువగా ఉన్నాయా ?

దొరికిన్నాడు దొరికేది. దొరకన్నాడు పస్తులే.

పల్లె వదిలివచ్చినా దౌర్భాగ్యం వాళ్ళను వదలిపెట్టలేదు.

ఒకరోజు రాత్రి చార్మినార్ చౌరాస్తా దగ్గరలో రిక్షా తొక్కుతున్న అతని మీదినుంచి తాగివున్న లారీ వెళ్ళింది.

ఆ లారీ ఓనరుకు పలుకుబడి బాగా వుంది.

రిక్షావాడే తాగి ఉన్నాడని నిర్ధారణ అయింది.

ఆ తల్లి. కొడుకుల బ్రతుకు బజారు పాలైంది.

వరండాలో నిలబడి అరటితొక్కలు విసిరేస్తున్నారు పిల్లలు.

ఆ తొక్కలకేసి ఆశగా చూస్తున్నాయి మేక, దాని పిల్లలు.

అడుగు ముందుకు వేస్తే చాలు....గుయ్...మని లేస్తున్నది కుక్క.

ఆ కుక్క తాను తినదు.

వాటిని తిననివ్వదు.

ప్రాణులను మనుషులు, జంతువులని వర్గాలుగా విభజిస్తే ఆ కుక్క, మేకలు ఒకే వర్గానికి చెందాలి.

కాని.... ఆ కుక్క తాను తన యజమాని ఒకే వర్గం అనుకొంటోంది. మేకల మెదడు కొరికేయాలన్నంత గుర్రుగా చూస్తున్నది.... పొగరుగా మొరుగుతున్నది.

మళ్ళీ తలుపులు తెరుచుకున్నాయి.

మళ్ళా ఆశ కనులు తెరుచుకుంది.

పనిమనిషి బయటికి వచ్చింది.

"నీ కాళ్ళు మొక్కుత.... కొడుక్కి మూడు రోజుల్నుంచి కూడులేదు. గంత బుక్కెడు సూడు....ఓవ్వ.... నీ కాళ్ళు మొక్కుత".

ఆమె కాళ్ళకు దండం పెడుతూ దీనంగా అడుగుతున్నది తల్లి.

"చెప్తాంటె నీక్కాదె - అసుంట ఉండు. ముట్టుకుంటవా ఏంది?" అని కసురుకున్నది పనిమనిషి.

వాళ్ళ కళ్ళలోని ఆశ మరోసారి ఉరిపోసుకున్నది.

వరండాలోకి వచ్చిన యజమానిగారు కుక్కను స్టైయిలుగా నిమిరి పిల్లలు పడేసిన అరటి తొక్కలను చూశారు! పనిమనిషిని పిలిపించి వాటిని తీయించి బయట పడేయించారు.

అరటి తొక్కలిప్పుడు రోడ్డు ప్రక్కన పడ్డాయి. మేక, దాని పిల్లలు గంతులేసుకుంటూ వెళ్ళి వాటిని అందుకున్నాయి.

విందు ముగిసింది.

మనుషులను, వారి కడుపుల్లోని స్వీట్లను, హాట్లను, డ్రింకులను మోసుకుంటూ ఒక్కటొక్కటిగా వాహనాలు వెళ్ళిపోతున్నాయి?

తినగా మిగిలిన ముక్కలను, వక్కలను గంపల్లోకెత్తి చెత్తకుండీలో పడ బోయడానికి దొడ్డిగుమ్మం తలుపులు తెరిచింది పనిమనిషి.

జాలిగా ఆమెవైపు చూసింది తల్లి.

జాలిగా ఆమెవైపు చూశాడు కొడుకు.

రెండుచేతులూ జోడించింది తల్లి - ఆమె నోట మాటరావటంలేదు. దుఃఖం పెల్లుబికి వస్తున్నది. కొడుకును చూస్తుంటే ఆమె మనసు నీరైపోతున్నది.

అప్పంలా ఆకలి ఆ పేగులను కోసేస్తున్నది....కొరికేస్తున్నది. ఏ క్షణంలోనైనా ఆ కట్టెలు పడిపోయేలా ఉన్నాయి.

ఆ పనిమనిషి గంపను చెత్తకుండీలో గుమ్మరించి వెళ్లిపోయింది.

తలుపులు మూసేసింది.

లచ్చుమయ్య తలుపులను చూశాడు. తల్లిని చూశాడు. చెత్తకుండీని చూశాడు.

ఆ తలుపులు తెరచుకోవు!

ఆ తల్లి నిస్సహాయురాలు!!

ఆకలి శత్రువులా కసితీర్చుకుంటున్నది. కళ్ళకు చీకట్లు కమ్ముకుంటున్నాయి-గొంతు తడారిపోతున్నది. తల తిరిగిపోతున్నది.

చెత్తకుండీనుండి ఘుమ ఘుమ వాసనలు వస్తున్నాయి.

ఆకలిని రమ్మని పిలుస్తున్నాయి.

పేగులు పొమ్మని అరుస్తున్నాయి.

అడుగులు అతన్ని చెత్తకుండీ దగ్గరకి లాక్కుపోయాయి....!!

రెండు చేతులు చాచి అందినవి తీసికొని గబగబా నోట్లో కుక్కుకోసాగాడు.

ఎప్పటినుంచో పొంచి చూస్తున్న రెండు మూడు కుక్కలు పరుగెత్తు కొచ్చాయి పోటీకి.

వాటిని ఒకచేత దూరంగా తరిమేస్తూ మరోచేత కుండీలోవి తీసుకొని ఆత్రంగా తినసాగాడు లచ్చుమయ్య!

భవనం యజమానిగారు విందు ఫోటోలు తీయటంకోసం ఫోటోస్టూడియోకు కబురు పంపించారు.

కలవారింటి బేరం! ...ప్రొప్రయిటర్ స్వయంగా వచ్చాడు. కెమెరా తీసుకొని తన పని పూర్తిచేసుకొని వెళ్ళిపోతున్న ప్రొప్రయిటరు చెత్తకుండీ దగ్గరి దృశ్యం చూసి రిక్షా ఆపించి అక్కడికి వచ్చాడు.

పోటీ కోసం కావలసిన ఫోటో గుర్తుకు వచ్చింది అతనికి —

"అరేయ్....అట్లనే నిలబడ్రా...." అని కెమెరా సెట్‌చేసి ఫోటో తీసుకున్నాడు.

ఆ తరువాత దిష్టిబొమ్మ చేతిలో పావలాపెట్టి రిక్షా ఎక్కి కెమెరా వెళ్ళిపోయింది!

చేతిలోని పావలా నాణాన్ని చూసి సంబరంగా ఎగిరిగంతేశాడు లచ్చుమయ్య.

"ఓవ్వ....ఇంగో!...." అంటూ చూపించాడు తల్లికి.

ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి....

ఆమె ఏడుస్తోంది!....

* * *

ఆమె పిచ్చిది....

ఏడ్చింది!

బహుమానంతేగల ఫోటోను కన్నందుకు గర్వపడాలి కాని!!....

*(యువ మంత్లీ - మే, 1979)*